# తెలుగులో తొంభైపైన మార్కులు సాధ్యమే

మాతృ భాషలో సులభంగా మార్కులు సాధించేందుకు విద్యార్థులు కష్టపడుతున్నారు. మిగిలిన విభాగాల్లో పూర్తి మార్కులు సాధించినా తెలుగులో 80లు దాటక, ఎందుకిలా జరుగుతోందో తెలియక అయోమయానికి గురవుతున్న విద్యార్థులు ఎందరో. దీనికి ప్రధాన కారణం తెలుగు పరీక్ష రాసే విధానంపై సరైన అవగాహన లేకపోవడం.

పరీక్ష రాసేటప్పుడు అక్షర దోషాలు, వ్యాకరణ దోషాలు, వాక్యార్థ దోషాలు ఇలా చేయాల్సిన తప్పులన్నీ విద్యార్థులు చేస్తున్నారు. ఇది తెలిసి చేస్తున్నదని అనుకోక పోయినా అవగాహనాలోపం అన్నది మాత్రం నిజం. తెలుగు పరీక్ష ఏ విధంగా రాయాలి. ఏవిధంగా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు, సులభంగా రాసే విధానం ఏమిటి, ముందు ఏ ప్రశ్నలకు సమాధానాలు రాయాలి, ప్రతి పదార్థాలకు ఏ పాఠాలు చదవాలి... ఇలా ఎన్నో సందేహాలు. సంవత్సరకాలం పాటు పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం సాధించేందుకు సన్నద్ధమయ్యే విధానాన్ని చూస్తే......

**సిలబస్ విభజన:**

సిలబస్‌ను నాలుగు భాగాలుగా విభజించుకోవాలి.

1) పద్యభాగం 2) గద్యభాగం 3) ఉపవాచకం 4) వ్యాకరణం.

ఈ నాలుగు భాగాల్లో దేనికదే ప్రత్యేకం. గరిష్ట మార్కులు సాధించేందుకు 4,3,2,1 అనే వరుస క్రమాన్ని అనుసరించాలి.

అందుకు కారణం పేపర్-1, 2 లనుంచి వచ్చే వ్యాకరణం విలువ మొత్తం మార్కుల్లో దాదాపుసగం -40

ఉపవాచకం నుంచి వచ్చే మార్కులు- 20

గద్య భాగం(వ్యాకరణ సంబంధ అంశాలు తీసేయగా)-20

పద్య భాగం(వ్యాకరణ సంబంధ అంశాలు తీసేయగా)-20

ఆయా విభాగాలనుంచి వచ్చే ప్రశ్నల క్రమాన్ని పరిశీలిస్తే...

**వ్యాకరణం :** ఇందులో పూర్తి మార్కులు సాధించాలంటే పద్య, గద్య, ఉపవాచకాలపై గట్టి పట్టు ఉండాలి. మిగిలిన విభాగాలతో పోలిస్తే ఇందులో మార్కులు సాధించడం ఎంత సులభమో అంత కష్టం.

**ఉదా:** సవర్ణదీర్ఘ సంధి గురించి అడిగితే సులభంగా సమాధానం రాయవచ్చు.

అయితే సవర్ణదీర్ఘ సంధి గురించి విద్యార్థికి కచ్చితంగా తెలిసి ఉండాలి. ఒక వేళ విద్యార్థికి అందులో విషయ పరిజ్ఞానం లేకపోతే మార్కులు వదులుకోవాల్సిందే.

అందువల్ల ఈ విభాగంలో ఉండే వివిధ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఇందులో ఉండే అంశాలు

- సంధులు, సమాసాలు
- ప్రకృతి,వికృతిలు
- నానార్థాలు, పర్యాయపదాలు
- ప్రక్రియలు
- గణ విభజన
- జాతీయాలు, సామెతలు
- అపరిచిత పద్యం, గద్యం
- సంశ్లిష్ట, సంయుక్త, సామాన్య వాక్యాలు
- లేఖలు, వ్యాసాలు

సంధి సూత్రాల్ని, సమాసాల్ని గుర్తుంచుకోవాలి. అందుకు కొన్ని బండ గుర్తులు పెట్టుకోవాలి.

**ఉదాః యొక్క వస్తే షష్టీతత్పురుష**

**వాక్యప్రారంభంలో అంకె ఉంటే ద్విగు సమాసం**

ఇలా గుర్తుంచుకుంటే అయోమయానికి గురవ్వకుండా సులభంగా సమాధానాలు గుర్తించేందుకు అవకాశం ఉంటుంది. అపరిచిత గద్యం, పద్యం అడిగి సమాధానాలు గుర్తించమంటారు. దీనికి 4 మార్కులు. అదే విధంగా పేరాగ్రాఫ్ ఇచ్చి సమాధానాలు గుర్తించమని అడిగే ప్రశ్నలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు. దీనికి 4 మార్కులు కేటాయించారు. లేఖ, వ్యాసం రాసేటప్పుడు పాటించాల్సిన నియమాల్ని పాటిస్తే వాటిలో పూర్తి మార్కులు సాధించడం సులభమే.

సంశ్లిష్ట, సంయుక్త, సామాన్య వాక్యాలు, జాతీయాలు వంటి విభాగాల్లో 20 మార్కులకు 19కి పైగా మార్కులు సులువుగా సంపాదించవచ్చు.

జాతీయాలు, సామెతలు, లేఖలు, వ్యాసాలు, అపరిచిత గద్య, పద్యాల్లో విద్యార్థి తాత్విక పరిజ్ఞానాన్ని విషయ నైపుణ్యాన్ని పరీక్షిస్తారు. ఇందులో సమాధానాలు సరైన పద్ధతిలో వివరిస్తే పూర్తి మార్కులు పొందినట్లే.

**ఉపవాచకంః**

ఈ విభాగంలో ఉత్తమ మార్కులు సాధించాలంటే ఉన్న ఏకైక మార్గం ఉపవాచకాన్ని రెండు మూడుసార్లు చదవడమే.

పార్వతీశం ప్రవర్తన, అతని తెలివితేటలు, వ్యక్తిత్వం మొదలైన అంశాలపై పూర్తి అవగాహన కలిగే విధంగా చదవాలి. దీనిలో నుంచి వచ్చే ప్రశ్నలకు ఇలాగే సమాధానం రాయాలనే నిబంధన లేదు. మీ అభిప్రాయాల్ని వెల్లడిస్తే చాలు అదే సమాధానం. అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం. సమాధానాలు శ్రుతి మించకుండా రాయడం. పైన చెప్పిన విధంగా చదివితే ఈ విభాగంలో మార్కులు రావనే అంశమే కన్పించదు.

**గద్య భాగం:**

దీనినుంచి ముఖ్యంగా వచ్చే విభాగాలు 3. అవి వ్యాసరూప ప్రశ్నలు, సందర్భ సహిత వాక్యాలు, ప్రక్రియలు.

వీటిపై పట్టు సాధించాలంటే పాఠ్యాంశం చదివి దాని సారాన్ని గ్రహించాలి. ఓ కథ చదివినట్లుగా పాఠ్యాంశాన్ని చదవాలి. ఇలా చేస్తే ఆయా ప్రశ్నలకు సమాధానాలు సులభంగా రాయవచ్చు.

**పద్య భాగం:**

మార్కుల ఉన్నతిని నిర్దేశించే విభాగం ఇది. మిగిలిన విభాగాలతో పోలిస్తే కఠిన మైనది ఇదే. ఇందులో పద్య పూరణం, ప్రతిపదార్థం, వ్యాసరూప సమాధాన ప్రశ్నలు, సందర్భ సహిత వాక్యాలు, మొదలైన అంశాలు ఉంటాయి. అయితే విద్యార్థులు ఈ విభాగంలో మంచి మార్కులు సాధించాలంటే అక్షర దోషాలు, వ్యాకరణ దోషాలు, వాక్యార్థ దోషాలు లేకుండా చూసుకోవాలి.

అన్ని పాఠాల్లోని వ్యాసరూప ప్రశ్నలుచదవాలి. ఆయా ప్రశ్నలకు రాసే సమాధానాల్లో భావం, అర్థం వ్యక్తమైతే మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

ప్రతిపదార్థ, పద్య పూరక పద్యాలకోసం 5 పాఠాల్లోని పద్యాలను అధ్యయనం చేయాలి.

- **ప్రవరుని స్వగతం,**
- **మాతృవేదన,**
- **జడివాన,**
- **సుభాషితాలు,**
- **తామసి,**
- **సందేశం**

ఈ పాఠాలను క్షుణ్నంగా చదివితే ఏ పద్యం ఇచ్చినా సులభంగా సమాధానం రాయవచ్చు.

ఈ అంశాలను గ్రహించి పరీక్షకు సన్నద్ధమైతే **''తెలుగులో తొంభై తథ్యం''.**